క్లుప్తంగా

పందుల స్వైరవిహారంతో ఇబ్బందులు



రోడ్డుపై సంచరిస్తున్న పందుల గుంపు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురం నుంచి మారికవలసకు వెళ్లే మార్గ మధ్యలో పందులు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. వీటిపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు ప్రాంతంలోని జమ్మిచెరువు పార్కులో జమ్మిచెరువు వాకర్స్ క్లబ్ సభ్యులు మీసాల బుచ్చిబాబు, కదిరి జగన్నాథం ఆధ్వర్యంలో బుధవారం ఉసిరి, మారేడు, కదంబం, జమ్మి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వర్షాలు సరిగ్గా పడడం లేదని, దీనివల్ల నీటి ఎద్దడి కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని ఎదుర్కోవాలంటే అందరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని, వాటి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

లో ఓల్టేజీ సమస్య తక్షణమే పరిష్కరిస్తాం

మధురవాడ : జీవీఎంసీ 8వ వార్డు పరిధి పాత మధురవాడ గ్రామంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని విద్యుత్ శాఖ విశాఖ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. ఈ ప్రాంతంలో లో ఓల్టేజీతోపాటు తరచూ అనధికార విద్యుత్ కోతలపై 'లో ఓల్టేజీతో నిత్యం అవస్థలు', 'విద్యుత్ కోతతో రాత్రంతా జాగారం' అనే శీర్షికలతో వరుసగా సాక్షిలో వార్తలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు వచ్చినా ఏఈ లేదా లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేయాలని, అనధికార వ్యక్తులను ఆశ్రయించవద్దన్నారు. అనధికార వ్యక్తులు ప్రభుత్వ పనుల్లో అనుమతి లేకుండా పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే గంటాకు ఆహ్వానం



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో ఎంపీడీవో జానకి, ఇతర అధికారులు

భీమునిపట్నం : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంపీడీవో జానకి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా త్వరలో నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి రావాలని ఆహ్వానించారు. దీనికి ఆయన స్పందించి సమావేశానికి వస్తానని తెలిపారు. అధికారులు గుండు అప్పలరాజు, ఎంఈవో జయప్రద, తదితరులు కలిశారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం కిట్లు పంపిణీ చేశారు. ఇందులో పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ నీరు ఉప్పుటేరు పాలు

- నెరవేరని నేతల 'చెక్‌డ్యామ్‌ల నిర్మాణ' హామీలు



గతంలో పూనిగట్టు వద్ద చెక్‌డ్యామ్ నిర్మించడానికి వేసిన సిమెంట్ పైపులు



చిట్టివలస వద్ద గోస్తనీ నదిపై శిథిలమైన పూనిగట్టు

తగరపువలస : తూర్పు తీర కనుమలలో అనంతగిరి కొండల్లో జన్మించిన గోస్తనీనది ఒడిశా, విజయనగరం, విశాఖ జిల్లాల పరిధిలోని 120 కిలోమీటర్లు ప్రయాణించి భీమిలికి ముందు ఉప్పుటేరు ద్వారా బంగాళాఖాతంలో కలుస్తోంది. లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న ఈ నది హిందువులకు అతి పవిత్రమైనది. భీమిలి తీరంలో సముద్రంలో కలిసేచోట గోస్తనీసాగర సంగమ ప్రదేశంగా పిలుస్తారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేయడానికి కాశీ, రాజమండ్రి, విజయవాడ వంటి పట్టణాలకు వెళ్లలేని వారు ఈ సాగర సంగమ తీరంలోనే కర్మలు ఆచరిస్తుంటారు. పన్నెండేళ్లకోసారి ఇక్కడే అర్ధోదయ, చంద్రోదయ వేళల్లో వేలాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. జీవీఎంసీ, విజయనగరం మున్సిపాల్టీ, విశాఖ, విజయనగరం జిల్లాల్లోని పలు గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించే గోస్తనీ నది నీరు తగరపువలస తర్వాత వృథాగా ఉప్పునీటిలో కలవడం చాలామందికి కలవరపరిచే విషయం. నాలుగు దశాబ్దాలుగా పలు ప్రభుత్వాలు గోస్తనీనదిపై చెక్‌డ్యామ్‌లు నిర్మించడం ద్వారా ఏడాది పొడవునా నీటిని నిల్వ చేసి వినియోగించుకోవచ్చని చేసిన వాగ్దానాలు నీటిపై రాతలుగానే కనిపించకుండా పోయాయి. 1990 వరకు చిట్టివలస వరకు నదిలో ఎత్తైన ఇసుక తిన్నెల కింద తియ్యటి గోస్తనీనీరు చుట్టుపక్కల గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేది. భీమిలి మున్సిపాల్టీ ద్వారా వీధి కుళాయిలు, ఇంటింటా కుళాయిలు లేనప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఇసుక దిబ్బల కింద నీటి చెలమలు తవ్వి కడవలపై మోసుకొచ్చేవారు. తర్వాత కాలంలో ఇసుక కోసం గోస్తనీ గర్భానికి తూట్లు పొడవడంతో తగరపువలస వరకు మంచినీటి స్థానంలో ఉప్పు నీరు ఊరడం ప్రారంభించింది.

చెక్ డ్యామ్‌ల హామీలు నీటిపాలు..

ప్రస్తుతం గోస్తనీనదిలో ప్రవహిస్తున్న నీరు భీమిలి మండలం టి.నగరపాలెం వరకు తాగునీటి అవసరాలకు పనికొస్తోంది. జీవీఎంసీ భీమిలి జోన్ ప్రజల తాగునీటి అవసరాలకు పాత వంతెన వద్ద అప్పట్లో నిర్మించిన గట్టు గుడ్డిలో మెల్లగా ఉపయోగకరంగా ఉంది. తగరపువలస నుంచి మూలకుద్దు వరకు నదిలో పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించి విశాలమైన పరీవాహక ప్రాంతంలో నీటిని ఏడాదిపాటు నిల్వ ఉంచవచ్చన్న విషయం ప్రజాప్రతినిధులు ప్రతిసారీ విస్మరిస్తున్నారు. వందేళ్ల క్రితమే చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం చిట్టివలస శివారులో పూనిగట్టు పేరుతో రాళ్ల వంతెన నిర్మించి నిల్వ చేసిన నీటి నుంచి వచ్చే ఆవిరితో యంత్రాలు నడిపేవారు. 2009 వరకు పూనిగట్టును కార్మికులు నదిని దాటడానికి వినియోగించుకున్న సమయంలో కూడా మంచినీరు ఉప్పునీటిలో కలవకుండా రక్షణగా ఉండేది. 2009లో మిల్లు లాకౌట్ తర్వాత పూనిగట్టు పూర్తిగా శిథిలమైంది. 2014 – 19 టీడీపీ ప్రభుత్వ హయాంలో తగరపువలస, చిట్టివలస మురుగునీటిని గోస్తనీ నదిలోకి మళ్లించడంతో నది పవిత్రత పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికైనా భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని భీమిలి మండలంలో మజ్జివలస, తాటితూరు, టి.నగరపాలెం, తగరపువలస, చిట్టివలస, మూలకుద్దు ప్రాంతాల వద్ద నదిలో చెక్‌డ్యామ్‌లు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం నదిలోకి వదులుతున్న మురుగునీటిని చెరువుల్లోకి మళ్లించాలని కోరుతున్నారు. ప్రస్తుతం టి.నగరపాలెం వద్ద ఉన్నట్టే మిగిలిన చోట్ల కూడా నదిలో స్నానాల ఘాట్‌లు నిర్మించి నది పవిత్రతను కాపాడాలని భీమిలి నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



ఉప్పుటేరులో కలిసిపోయిన గోస్తనీ నది

సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు కార్యాచరణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించిందని, దీనిని అమలు చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం సికిల్ సెల్ అనీమియా డే (రక్తహీనత దినం) సందర్భంగా మారికవలస బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంతాల్లో దీనిపై అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సికిల్ సెల్ అనీమియా అంటే వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమన్నారు. చాలా సంవత్సరాలు తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేకపోవడం వల్ల శరీరంలోని ఏ భాగంలోనైనా కణజాలం నష్టానికి దారి తీస్తుందన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాల్లో ప్రధానంగా రక్తకణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత), కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒంటి, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచూ వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, నోడల్ అధికారి అఖిల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్, మెడికల్ అధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం లక్ష్మీ హోమం

కొమ్మాది : సాగర్‌నగర్‌లో గల శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయంలో రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 10.30 వరకు, మరలా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా ప్రతీ శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి లక్ష్మీ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

23న మెగా వైద్య శిబిరం

పీఎం పాలెం : ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 23న నిర్వహించనున్న సువర్ణ భారతి సేవా ఉత్సవాల్లో భాగంగా పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెంకు వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని మఠం గౌరవ పరిపాలన అధికారి జె.వెంకటేశ్వర్లు తెలిపారు. కళా హాస్పిటల్, లయన్స్ క్లబ్, ఇతర వైద్య సంస్థల సమన్వయంతో నిర్వహించే శిబిరంలో రక్తదానంతోపాటు బీపీ, సుగర్ వంటి 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు సేవలందిస్తారని, ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డు పరిధి బక్కన్నపాలెం సబ్ స్టేషన్ 11 కేవీ సిద్ధార్థనగర ఫీడర్, 11 కేవీ హెచ్‌పీసీఎల్ ఫీడర్ ఏరియాలో శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో సిద్ధార్థనగర్, సాండ్ అండ్ సాండ్ లే అవుట్, ఎస్‌బీఐ లే అవుట్, దుర్గమ్మ టెంపుల్ వెనుక ప్రాంతం, పీఎం పాలెం ఆఖరు బస్టాపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

12లోగా పాఠశాలల్లో చేర్పించాలి

తగరపువలస : జూలై 12లోగా 6 నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆనందపురం తహసీల్దార్ హేమంత్ కుమార్ అధికారులకు సూచించారు. 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి బడి బయట పిల్లలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఎంఈవో గంగరాజు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పీటీఐలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విష పురుగుల సంచారంతో ఆందోళన



విష పురుగులతో నిండిపోయిన గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు పరిసరాలు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు పరిసరాల్లో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండి అందులో తుప్పలు పెరిగిపోయినందున వీటికి ఆవాసంగా వుంది. ఈ ప్రాంతంలోనే పలు ప్రభుత్వ, ప్రైవేట్, విద్యాసంస్థలు, వసతిగృహాలు ఉన్నందున విద్యార్థులు కూడా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. చుట్టు పక్కల ఇళ్లలోకి విష పురుగులు ప్రవేశిస్తున్నందున జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వడం ద్వారా కలుపు మొక్కలు తొలగించే ఏర్పాట్లు చేయాలంటున్నారు. వర్షాలు కురిస్తే వీటి బెడద మరింత ఎక్కువగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

సుత్తమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



అలంకరణలో సుత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని బుధవారం గజమాలలు, తులసి మాలలు, వేపాకు దండలు, వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తాగునీరు, ప్రసాదాలు అందించారు.

వాల్తేర్ డివిజన్ టెక్నీషియన్లకు ప్రత్యేక సదస్సు



సెమినార్‌లో పాల్గొన్న టెక్నీషియన్లతో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రైలు ఎస్కార్టింగ్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ఎలక్ట్రికల్ విధులు నిర్వర్తించే సిబ్బందికి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎదురయ్యే లైటింగ్, ఏసీ, థర్మల్ కంఫర్ట్ వంటి సమస్యలను పరిష్కరించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తుంటారు. ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించేందుకు వీరు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ సమస్యలను సత్వరమే పరీక్షిస్తుంటారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు అత్యంత ప్రమాణాలతో కూడిన సేవలందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. కౌన్సెలింగ్ సెమినార్ ద్వారా భద్రత, సురక్షితం గురించి టెక్నీషియన్లకు ఎన్నో విషయాలు తెలియజేసినట్లు చెప్పారు. ఆయా విభాగాల మధ్య ఉన్న తాధికారులతో కమ్యూనికేషన్ విధానాలు, టీం వర్క్, సహకారం అంశాలపై వివరించారు.

26న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

మురళీనగర్: హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఈ నెల 26న నిర్వహించాలని షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగుల సంఘం నెల వారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ రుసుం రూ.250 వసూలు చేయాలని తీర్మానించారు. ఈ నెల 26న మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో 80 ఏళ్లు దాటిన వారిని సత్కరించాలని నిర్ణయించారు. సమావేశంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపనిషత్తులు విలువైన సంపద

సీతంపేట: వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సమాజం, పాశ్చాత్య సమాజాల మీద ప్రభావం చూపాయని కవి, రచయిత డాక్టర్ కె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉపనిషత్తులు మన విలువైన సంపదలు' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వేద కాలం పూర్వం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు వేదాలు, ఉపనిషత్తులు భారతీయ, పాశ్చాత్య సమాజాలపై ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటి అర్థాలను వివరించారు. అరిస్టాటిల్, వివేకానందుడు నుంచి నేటి ఆధునిక కవులు, తత్వవేత్తల మీద ఉపనిషత్తుల ప్రభావాన్ని తెలియజేశారు. గ్రీకు నుంచి అమెరికా వరకు పాశ్చాత్య కవులు వీటిని ఏ మేరకు ఆదరించారో వివరించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల్లో నాలుగు భాగాలైన సంహితలు, బ్రహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తుల్లో ఒకటని పేర్కొన్నారు. ఇది పూర్తిగా జ్ఞాన కాండ అని, నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని, విదేశాల్లో సైతం ఈ విజ్ఞానం ఎందరో నేర్చుకుని లబ్ధి పొందుతున్నారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ఉపనిషత్తులు అమూల్యమైన జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు కలుషితం చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



యాతపేటలో స్థానికులతో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు

తగరపువలస : నివాసాల చుట్టూ పరిసరాలను కలుషితం చేస్తే ఊరుకునేది లేదని జీవీఎంసీ భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు హెచ్చరించారు. 'నివాసాల మధ్య అడవి పందుల మాంస వ్యర్థాలు' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. బాలాజీనగర్ యాతపేటలో బుధవారం ఆయన శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బందితో పర్యటించి పరిసరాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ వన్యప్రాణుల వధ చట్టరీత్యా నేరమన్నారు. అలాంటివి ప్రోత్సహించవద్దని సూచించారు. బయటి వ్యక్తులు ఎవరైనా వచ్చి అడవి పందులను వధించినా సమాచారం అందించాలని కోరారు. అలాగే పరిసరాలను కలుషితం చేయడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున స్థానికులు పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆహ్లాదం కోసం పార్కుల అభివృద్ధి



పార్కు అభివృద్ధిపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

మధురవాడ : ప్రజలకు ఆహ్లాదం కోసం పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. ఐటీ సెజ్ సమీపంలోని తారకరామ నగర్ లే అవుట్ వద్ద గల ఐటీ పార్కు, టెన్నిస్ కోర్టు పనులను వివిధ విభాగాల అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ మ్యాప్‌ను చూసి చేపట్టాల్సిన పనులు, మార్పులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు, టెన్నిస్ కోర్టు పనులు తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజును ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



రుషికొండలో రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ, సాగర్ నగర్, ఎండాడ, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తి స్థాయిలో లోపించింది. వీధుల్లో, రోడ్ల మీద, డ్రైనేజీల్లోనూ చెత్త పేరుకుపోయింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ వార్డులో పర్యటించినప్పుడలా పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ స్థానిక అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. తూతూ మంత్రంగా పారిశధ్య పనులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువకుడు అదృశ్యం



హేమకుమార్

పీఎం పాలెం : ఓ యువకుడు అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డులో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వీరవల్లి హేమకుమార్ (27) భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. అతడు మెట్రో స్టోర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 12న హేమకుమార్‌కు అతని భార్యకు జీతం విషయమై గొడవ జరిగింది. ఆ మరుసటి రోజు 13న రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి భార్యకు చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో హేమకుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ బోల్తా



రోడ్డుపై తిరగబడిన లారీ

కొమ్మాది : బీచ్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి భీమిలి వైపు వెళ్తున్న లారీ రుషికొండ బే పార్కు దాటిన తర్వాత అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఇతర వాహనాల రాకపోకలు, మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ అతి వేగంగా లారీ నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

తుమ్మచెట్టు నీడే దిక్కు..!



చిట్టివలస - శ్రీరామ్‌నగర్ రహదారిలోని శ్మశానవాటికలో తుమ్మచెట్టు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస గ్రామ ప్రజలు వినియోగించే శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. శ్రీరామనగర్ – మూలకుద్దు రహదారిలో గోస్తనీ నది వద్ద ఉన్న ఈ శ్మశానవాటికలో కేవలం తుమ్మచెట్టు నీడే అంతిమ యాత్ర వెంట వచ్చే వారికి దిక్కు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో శ్మశానవాటికకు వచ్చేవారి అవసరాల కోసం జీవీఎంసీ నిర్మించిన బోరు సైతం జ్యూట్‌మిల్లు యాజమాన్యం కబ్జా చేసింది. ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం షెడ్డు, ప్రహరీ నిర్మిస్తామని జీవీఎంసీ అధికారులు ఐదేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. గోస్తనీనదికి వరదలు వచ్చినప్పుడు నీరు రహదారిపైకి రాకుండా విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ పంచాయతీ నిర్మించిన రక్షణ గోడే శ్మశానవాటికకు వచ్చే వారు కూర్చోవడానికి ఉపయోగపడుతోంది. వార్డులోని ప్రజలకు వసతుల కల్పన విషయంలో జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్మశానవాటికలో వసతుల కల్పనను కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

మహారాణిపేట : రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, బోధకాలు వంటివి రాకుండా కాపాడుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ రాజ్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల బెడద నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ దోమల నియంత్రణ మనందరి బాధ్యత కనుక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు నిర్మూలించటం కోసం ఎవరి ఇంట్లో దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు.